

గిరిజన బిడ్డలకు అండగా..
అందరూ కదలాలి..



మహాధర్నాలో మాట్లాడుతున్న కేటీఆర్, వేదికపై మధుసూదనాచారి, ఎర్రబెల్లి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు

- ఎక్కడ అన్యాయం జరిగితే బీఆర్ఎస్ అక్కడ ఉంటుంది
- కాంగ్రెస్‌కు భయపడేది లేదు.. ఆ పార్టీని కూకటివేళ్లతో పెకిలిస్తాం
- మానుకోట నుంచే మొదటి అడుగు పడింది
- మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మానుకోట మహాధర్నా కార్యక్రమానికి హాజరైన జనం

మహబూబాబాద్ / మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గిరిబిడ్డలకు అండగా అందరూ కదలాలని, రాష్ట్రంలో ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా బీఆర్ఎస్ అక్కడ ఉంటుందని, అందుకు మానుకోట నుంచే మొదటి అడుగు పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. సీఎం సొంత నియోజకవర్గమైన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని లగచర్లలో గిరిజనులపై అక్రమ కేసులు, అరెస్టులకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి చేపట్టిన మహాధర్నా మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. ఈ ధర్నాకు హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ గతంలో గిరిజనులు చేసిన డిమాండ్ మేరకు కేసీఆర్ ఆరు శాతం ఉన్న రిజర్వేషన్లు 10 శాతానికి పెంచారని, తండాలను గ్రామ పంచాయతీలుగా చేశారని, పోడు భూములకు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. అయినా కొన్ని మాయమాటల కారణంగా మోసపోయామని, రేవంత్‌రెడ్డి గిరిజన భూములు గుంజుకుంటున్నారని, అలాంటి వారిని ఒక్క మానుకోటలోనే కాదు.. ఊరూరా ఉరికించి కొట్టే బాధ్యత అందరిపై ఉందన్నారు. మానుకోటలో కదం తొక్కి తమకు శక్తినిచ్చిన అందరినీ జీవితాంతం గుర్తు పెట్టుకుంటామని, బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితియే కాదని, బంజారా రాష్ట్ర సమితి కూడా అని పేర్కొన్నారు. బంజారాలకు ఏ కష్టం వచ్చినా... అండగా ఉంటామంటూ కేటీఆర్ వారికి భరోసానిచ్చారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనను ఎండగట్టేందుకు మానుకోట నుంచే మొదటి అడుగు పడిందని, ఇదే స్ఫూర్తితో రాష్ట్రమంతా తిరిగి కాంగ్రెస్ పార్టీని, సీఎంను కూకటి వేళ్లతో పెకిలిస్తామన్నారు. 14ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో కీలకమైన మలుపునకు నాంది పలికిందని, మళ్లీ అదే మానుకోట కొత్త నియంతకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమైందన్నారు. ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి ప్రధాని మోదీ లాంటి వ్యక్తినే నల్లచట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని, రైతుల పోరంటే అదేనని, అలాంటి రైతులతో రేవంత్‌రెడ్డి పెట్టుకున్నారని, సన్నకారు.. బక్కచిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ సీఎం రేవంత్‌రెడ్డికి తప్పకుండా

మిగతా 7వ పేజీలో...

గులాబీ స్కెచ్ సక్సెస్!

- మానుకోట మహాధర్నాకు భారీగా తరలొచ్చిన శ్రేణులు
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి రాక
- ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు
- ప్రసంగంలో మానుకోట ప్రాధాన్యాన్ని గుర్తుచేసిన కేటీఆర్

7

గ్లోబల్ లీడర్లుగా తయారు చేయాలి

జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి



డోర్నకల్ కస్తూర్బా పాఠశాలలో తనిఖీ నిర్వహిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

డోర్నకల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించి వారికి సరైన రీతిలో బోధించి గ్లోబల్ లీడర్లుగా తయారు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న శక్తి సామర్థ్యాలను ఉపాధ్యాయులు గుర్తించి బయటకు తీయాలన్నారు. వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులను బృందాలుగా విడదీసి విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గుండాల మురళీధర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి గుండాల మురళీధర్

నెల్లికుదురు సెంటర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వే ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గుండాల మురళీధర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యాధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మురళీధర్ మాట్లాడుతూ... ఇంటింటి సర్వే ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తులను ముందుగానే

మిగతా 8వ పేజీలో...

ఉపకారమేదీ?

- పెండింగ్‌లో 23వేల దరఖాస్తులు
- రెండేళ్లుగా రాని నిధులు
- చదువులు కొనసాగించడంలో ఆటంకాలు



హనుమకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్పసంఖ్యాక వర్గాల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా విద్య ద్వారా వారి ఆర్థిక, సామాజిక జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నాయి. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటోంది. సంక్షేమ పథకాల సంగతి అటుంచితే కనీసం మైనారిటీ విద్యార్థులకు ఉపకార వేతనాలను కూడా ఇవ్వడం లేదు. దీంతో మూడేళ్లుగా విద్యార్థులు చదువులు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలు మైనారిటీలకు స్కాలర్‌షిప్స్ పథకం అమల్లో ఉందా? లేదా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవలసిందిగా చేసిన ప్రకటనలతో ఆశగా దరఖాస్తులు చేసుకున్న మైనారిటీ విద్యార్థులకు ఏళ్ల తరబడి ఎదురుచూపు తప్పా నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థుల నిరాశకు గురవుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అసలే మైనారిటీ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉంటాయి. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి వారిది. అయినా తమ పిల్లలను చదివించి వారిని ప్రయోజకులను చేయాలని తల్లిదండ్రులు తపిస్తూ ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే కొద్ది పాటి ఉపకారవేతనాలు ఎంతో కొంత తోడ్పాటుగా ఉండకపోతాయా అని ఆశించినా ఫలితం లేకుండా పోతోంది.

ఉమ్మడి జిల్లాలో 4.49లక్షల మంది మైనారిటీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 4.49 లక్షల మంది మైనారిటీలున్నారు ముస్లిం, క్రిస్టియన్, జైన, బౌద్ధ, సిక్కు, జోరాస్ట్రియన్ వర్గాలకు చెందిన వారు మైనారిటీల కిందకు వస్తారు. ఉమ్మడి జిల్లాలో ముస్లిం, క్రిష్టియన్ వర్గాలకు చెందినవారే ఎక్కువగా ఉన్నారు. హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో వీరు ఎక్కువగా ఉన్నారు. మైనారిటీ విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు మొదట్లో ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్, మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్పుల ద్వారా కాస్తంతైనా ఆర్థిక సాయం అందేది. 2021-22 సంవత్సరం తర్వాత నుంచి అసలు స్కాలర్‌షిప్పులు రావడమే ఆగిపోయింది.

మొండిచేయి..

కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఎనిమిది తరగతుల మైనారిటీ విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ను రద్దు చేసింది. దీనిపై ప్రతిపక్షాలు గతంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. కాగా 9,10 తరగతి విద్యార్థులకు మాత్రమే స్కాలర్‌షిప్‌లను అందజేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు విద్యా చట్టం ప్రకారం ఉచిత నిర్బంధ విద్యను అందిస్తున్నప్పుడు స్కాలర్‌షిప్‌లు అవసరం లేదన్నది ప్రభుత్వ వాదన. దీంతో 1 నుంచి 8వ తరగతి మైనారిటీ విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఎలాగో అందకుండా పోయాయి. కనీసం 9,10, ఇంటర్, డీగ్రీ, పీజీ విద్యార్థులకైన ప్రీ, పోస్టు, మెరిట్ కం మీన్స్ ఉపకారవేతనాలనైనా అందించకపోవడంతో విద్యార్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్..

ఈ పథకం ద్వారా 9, 10తరగతి చదువుకునే మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు అర్హులు. తల్లి దండ్రుల లేదా సంరక్షకుల వార్షికాదాయం రూ.లక్ష మించరాదు. ఈ స్కారలషిప్ కింద ఏడాదికి రూ.5వేలు మంజూరు అవుతాయి. 2021-22 సంవత్సరంలో 33,876మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా

మిగతా 8వ పేజీలో...

28న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో ఈనెల 28న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంపై ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న నేపథ్యంతో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 28న రాష్ట్రం నుంచి జయజయహే ప్రజాపాలన కళాబృందం ప్రొఫెసర్ అలేఖ్య పంజాల, చైర్‌పర్సన్ సంగీత నాటక అకాడమీ సారథ్యంలో జిల్లాలో వివిధ కళారూపాలతో ప్రభుత్వ కార్యక్రమాలు, గత సంవత్సర కాలంలో సాధించిన విజయాలను తెలుపుతూ కళా ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాకు వచ్చే కళాబృందానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమం నిర్వహించే చోట సీటింగ్ అరెంజ్‌మెంట్స్, వీఐపీ గ్యాలరీ, ప్రెస్ గ్యాలరీ, తాగునీరు తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేయాలని సూచించారు. అలాగే జిల్లాలో నవంబరు 19 నుంచి డిసెంబరు 7 వరకు ప్రజాపాలన విజయోత్సవాల జిల్లా కళాయాత్ర మూడు బృందాలుగా ఏర్పడి ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్నారని చెప్పారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, అదనపు ఎస్పీ చెన్నయ్య, అధికారులు మధుసూదన్‌రాజు, సుబ్బారావు, పి.రాజేంద్రప్రసాద్, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, డాక్టర్ మురళీధర్, రవీందర్‌రెడ్డి, మధు, ఉపేందర్, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుతో బీఆర్ఎస్ నేతల్లో గుబులు

- సీఎం రేవంత్‌రెడ్డి అంటే కేటీఆర్‌కు ఎందుకంత భయం
- ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు బీఆర్ఎస్ కుట్రలు
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో బీఆర్ఎస్ నేతల గుండెల్లో గుబులు మొదలైందని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం లగచర్లలో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని రైతులను ఒప్పించి అక్కడ అభివృద్ధికి శ్రీకారం చుడితే బీఆర్ఎస్ నేతలు దళిత, గిరిజన రైతులను ఉసిగొల్పి సమస్యను సృష్టిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను అందరు హర్షిస్తుంటే జీర్ణించుకోలేని మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిర పర్చాలనే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్ మహాధర్నాకు ఇక్కడి జనం రాకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి తరలించినా పేలవంగా సాగిందన్నారు. కేవలం 15 నిమిషాల పాటు మాట్లాడి వెళ్లి పోయారని, గిరిజనుల్లో బీఆర్ఎస్‌కు ఎంత ఆదరణ ఉందో తేట తెల్లమైందని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7.50 లక్షల కోట్లు అప్పులు చేసి పోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఓ పక్క వాటికి వడ్డీలు కడుతూ మరో పక్క ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. ఈ-రేస్ కేసులో కేటీఆర్ అరెస్టు అవుతారనే భయంతోనే ఉక్కిరి బిక్కిరవుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఆటలు ఇక సాగవని, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా తెలంగాణ ప్రజలంతా కాంగ్రెస్ వైపు ఉన్నారని తెలిపారు. సమావేశంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, గుగులోతు దస్రూనాయక్, నీరుటి లక్ష్మీనారాయణ, బండారు వెంకన్న, అంబటి మహేందర్‌రెడ్డి, ఖలీల్‌పాషా, ఎడ్ల రమేష్, బానోత్ హరిసింగ్, భూక్య శ్రీను, కోటి శ్రీను, బాలునాయక్, సిరిపురం వీరన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

- తొలి జీతం తీసుకోకుండానే మృత్యు ఒడిలోకి
- కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలంటూ ఉపాధ్యాయుల రాస్తారోకో



ఉపేందర్ (ఫైల్)



గంగారం సెంటర్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

గంగారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో కష్టపడ్డాడు. చివరకు కల సాకారం చేసుకున్నాడు. ఎంతో ఆనందంగా నెల క్రితం ఉపాధ్యాయుడిగా కొలువులో చేరాడు. కానీ ఆ ఆనందం క్షణాల్లో ఆవిరై పోయింది. ఆ కుటుంబానికి తీరని విషాదమే మిగిలింది. కనీసం మొదటి జీతం తీసుకోకుండానే మృత్యువు ఆ ఉపాధ్యాయుడిని రోడ్డు ప్రమాదంలో బలిగొంది. ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పుల్సంవారి గుంపులో జరిగింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సంద్ర ఉపేందర్(45) 2024 డీఎస్సీలో ఎస్జీటీగా ఉద్యోగం పొంది గంగారం మండలంలోని మర్రిగూడెం పుల్సంవారి గుంపులో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో స్వగ్రామమైన కొత్తపేట వెళ్లిన ఉపేందర్.. సోమవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై పుల్సంవారి గుంపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో బావురుగొండ వద్ద ఓ లారీ వేగంగా వచ్చి వెనుక నుంచి అతడి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయాలపాలై రోడ్డుపై పడి ఉన్న ఉపేందర్‌ను అటుగా వస్తున్న వారు గమనించి కాపాడే ప్రయత్నం చేశారు. తనను లారీ ఢీకొట్టిందని చెప్పి ఉపేందర్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రవికుమార్.. వెంటనే అప్రమత్తమై మర్రిగూడెం వద్ద లారీతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఉపాధ్యాయుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. ఉపేందర్‌కు భార్య స్వప్న, కుమారుడు ప్రేమ్‌తేజ, కుమార్తె శాన్విత ఉన్నారు. అయితే ఉపేందర్ తమ పాఠశాలకు కొత్తగా వచ్చినా మంచిగా పాఠాలు చెబుతున్నాడని పాఠశాల చిన్నారులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇక ఉపేందర్ కనీసం నెల జీతం తీసుకోకుండానే రోడ్డు ప్రమాదంలో మరణించటం తట్టుకోలేక పోతున్నామని గ్రామస్థులు, తోటి ఉపాధ్యాయులు తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల రాస్తారోకో

విధి నిర్వహణ కోసం వెళుతూ రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉపాధ్యాయుడు సంద్ర ఉపేందర్(45) కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాలు నల్లబ్యాడ్జీలు ధరించి గంగారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ముడిగ రామచంద్రం మాట్లాడుతూ ఉపేందర్ కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

సెక్టోరియల్ అధికారులతో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా


వినతులు స్వీకరిస్తున్న చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలను సెక్టోరియల్ అధికారులు సత్వరంగా పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఆదేశించారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆమె గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన దర్బారులో వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలసత్వం వహించకుండా ప్రాధాన్యక్రమంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గిరిజన దర్బార్‌లో 15 మంది తమ వినతులను పీవోకు అందజేశారు. తమకు మంజూరైన అటవీ హక్కుల పత్రంలో పేరు మార్పు చేయాలని ములుగు జిల్లా తాడ్వాయి మండలం లవ్వాల గ్రామానికి చెందిన నాగరాణి వినతిపత్రం అందించారు. ఐటీఐలో ఫిట్టర్ కోర్సు పూర్తి చేశానని, ఉద్యోగావకాశం కల్పించాలని మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన భూక్యా రాములు కోరారు.

తమ గ్రామంలో డ్రెయినేలు నిర్మించాలని వరంగల్ జిల్లా ఖానాపురం మండలం నాజితండాకు చెందిన గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు చేసి పనులను చేపట్టాలని మహబూబాబాద్ జిల్లా గూడురు మండలానికి చెందిన భూక్యా దేవేందర్ విన్నవించారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, ఎలక్ట్రిక్ కుట్టుమిషన్‌ను మంజూరు చేసి జీవనోపాధి కల్పించాలని ములుగు జిల్లా వెంకటాపురం మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన భాగ్యవతి కోరారు. ఐటీడీఏ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని గోవిందరావుపేట మండలం చల్వాయికి చెందిన బంగారి యాకలక్ష్మి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఎస్‌వో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు పింగిళి కళాశాలలో మెగా జాబ్‌మేళా

వడ్డేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ (టీకేసీ) ఆధ్వర్యంలో ఈనెల 27న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళిగౌడ్ తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో 14 కంటే ఎక్కువ ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలు పాల్గొని జాబ్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ అర్హతలు కలిగి ఉన్న విద్యార్థులు, నిరుద్యోగులు ఉదయం 9.30 గంటలకు జాబ్ మేళా కోసం రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ మెంటర్ మహ్మద్ రఫీ ఫోన్ నంబర్ : 98856 85383 లో సంప్రదించాలని ఆయన కోరారు.

'చిన్న కాళేశ్వరం'

భూసేకరణ వేగవంతం చేయాలి

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వినయ్ కృష్ణారెడ్డి, చిత్రంలో కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణను వేగవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రాహుల్‌శర్మ అధ్యక్షతన కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్, విద్యుత్, మెగా ప్రాజెక్టు అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులపై సమీక్షించారు. ప్రాజెక్టు నిర్మాణానికి 60వేల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరాకు ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణమే అనుమతులు ఇవ్వాలన్నారు.

భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలు త్వరగా పంపించాలన్నారు. భూసేకరణ చేసిన ప్రాంతాల్లో వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. డిసెంబర్ 5న డ్రై రన్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఇరిగేషన్ ఈఈ యాదగిరి, మైనింగ్ ఏడీ జయరాజ్, విద్యుత్ ఎస్ఈ మల్హార్ నాయక్, ఆర్డీవో మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రూ.లక్షలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌ది
- రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్
- ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్


పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రనాయక్

పాలకుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అయినా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలనే దురుద్దేశంతో బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రనాయక్ మండిపడ్డారు. సోమవారం పాలకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. చైర్‌పర్సన్‌గా లావుడ్యా మంజుల, వైస్‌చైర్మన్‌గా అనుమల మల్లారెడ్డితో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు కాంగ్రెస్ కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వరకు శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. రాంచంద్రనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటికి రూ. 7.19లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, ధనిక రాష్ట్రమని చెప్పి, కేసీఆర్ ప్రజల్ని మోసం చేశాడని ఆరోపించారు. ఇప్పటి వరకు రూ. 22లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి రూ.18వేల కోట్లు వారి ఖాతాల్లో వేశామన్నారు. మరో రూ.13వేల కోట్లు డిసెంబరులో పూర్తి చేస్తామన్నారు. డిసెంబరులో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర పేరుతో పాదయాత్ర చేసి పేదల కష్టాలను తెలుసుకున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం నిర్మాణంలో పెద్ద అవినీతి తిమింగలం బీఆర్ఎస్ నాయకలేనని ఆరోపించారు. లగచర్ల ఘటనకు ఆ నాయకలే సూత్రధారులన్నారు. గతంలో ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన నీచ చరిత్ర ఆ పార్టీదని, ఎన్ని కుట్రలు చేసినా ప్రజలంతా కాంగ్రెస్‌కు అండగా ఉంటున్నారన్నారు. ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేస్తోందని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్‌కార్డులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమే తప్ప మాటలు చెప్పేది కాదన్నారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లు రానున్న ఐదేళ్లలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎంపీ రవీంద్రనాయక్, తొర్రూరు మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, చిలువేరు కృష్ణమూర్తి, లావుడ్యా భాస్కర్, టీపీసీసీ రాష్ట్ర నాయకుడు లాకావత్ లక్ష్మీనారాయణ నాయక్, శ్రీరామ్, సురేష్ నాయక్, హమ్యానాయక్, గాదెపాక భాస్కర్, గడ్డం యాకసోమయ్య, కమ్మగాని నాగయ్య, రాజేష్ నాయక్ ఉన్నారు.

పోలీసు జాగిలం మృతి

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు


జాగిలానికి గౌరవ వందనం సమర్పిస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా పోలీసు శాఖలో విశేష సేవలందించిన జాగిలం అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. పోలీసులు అధికార లాంఛనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. స్కాంపర్ అనే జాగిలం ఐబీటీఏ మోయినాబాద్‌లో పేలుడు పదార్థాలను కనిపెట్టడంలో శిక్షణ పొందింది. 2018లో ములుగు బాంబ్ స్క్వాడ్‌కు ఈ జాగిలాన్ని కేటాయించారు. ఆరేళ్లపాటు సేవలందించిన స్కాంపర్ కొద్దిరోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఈక్రమంలో సోమవారం ఉదయం మరణించింది. ములుగు మండలం జాకారంలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో ఈ జాగిలానికి ఎస్పీ శబరీశ్, అదనపు ఎస్పీ సదానందం, పోలీసు అధికారులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో గాల్లోకి కాల్పులు జరిపి ఖననం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు సంతోష్, వెంకటనారాయణ, తిరుపతిరెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు, డాగ్‌స్క్వాడ్ బృందం పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తెచ్చి బోనస్ పొందాలి

ఎమ్మెల్యే మురళీనాయక్


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వం ఇస్తున్న బోనస్ పొందాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని తాళ్లపూసపల్లిలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం సన్నరకం ధాన్యానికి గత ప్రభుత్వాలు ఇవ్వని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, బండారు వెంకన్న, కూరెల్లి సతీష్, యాకయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, కొమురయ్య, దాను ఏవో బి.వెంకన్న, సొసైటీ సీఈవో వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

కరెంట్‌తో చేపల వేట.. ప్రాణాలతో ఆట


కరెంట్ తీగలు పెట్టి చేపలు పడుతున్న యువకులు

చిన్నగూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కొంత మంది యువకులు వలలతో కాకుండా కరెంట్ షాక్‌తో చేపలు పడుతున్నారు. చిన్నగూడూరు, ఉగ్గంపల్లి గ్రామాల మధ్య ఉన్న ఆకేరు వాగులో చేపల వేట కోసం వెళ్లి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కరెంట్ వైర్ల ద్వారా విద్యుత్ ప్రసరింప చేసి నీటిలో చేపలకు షాక్ తగలడంతో చేపలు చనిపోయి లేదా అస్వస్థతకు గురై నీటిపై తేలుతుండటంతో వాటిని పట్టుకొని తీసుకువెళ్తున్నారు. అవగాహన లోపంతో కరెంట్, నీరు కలయిక ఎంత ప్రమాదమో తెలియక కరెంట్ వైర్లతో చేపలు పడుతూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. సంబంధిత అధికారులు తెలిసి కూడా చూసిచూడనట్లు వ్యవహరించడంతో కరెంట్‌తో చేపల వేటకు వెళ్లే వారి సంఖ్య మండంలో రోజురోజుకు పెరిగిపోతోంది. అధికారులు కరెంట్‌తో చేపల వేటకు వెళ్లే వారిని నివారించి ప్రజల ప్రాణాలు కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గట్టమ్మ తల్లి నాయకపోడ్‌ల దైవమే

గుట్టపై ఆర్కియాలజీ బృందం పరిశోధనలు


గట్టమ్మ గుట్టపై గుర్తించిన కోనేరు వద్ద పరిశోధన బృందం సభ్యులు

ములుగు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కేంద్రం శివారులోని గట్టమ్మతల్లి నాయకపోడుల దైవమేనని, గట్టమ్మ దేవర మేడారం సమ్మక్క తల్లి అంగ రక్షకులలో ముఖ్యమైన వ్యక్తి అని సమ్మక్క, సారలమ్మ ఆర్కియాలజీ పరిశోధన కేంద్రం డైరెక్టర్ కాక నరసింగారావు తెలిపారు. జాయింట్ డైరెక్టర్ బుగ్గ కోటేశ్వర్‌రావు, మేడారం ఆదివాసీ మ్యూజియం అసిస్టెంట్ క్యురేటర్ కురసం రవి, ఇర్ప ప్రభాకర్ తదితరులు తాళపత్రం ఆధారంగా ఆదివారం గట్టమ్మ గుట్టపై నాలుగు కిలోమీటర్లు ప్రయాణించి కొలను, కొండ గుహ, పాత గద్దె గుర్తించినట్లు తెలిపారు. ములుగు గ్రామాన్ని మొదటగా 'కొత్త' అనే ఇంటిపేరు కలిగినవారు గట్టమ్మ జాతరను ఈ కొండ ప్రాంతంలో నిర్వహించేవారని నిర్ధారించామన్నారు. పరిశోధన అంశాలను పుస్తక రూపంలో తీసుకొచ్చి పూర్వ చరిత్రను బతికించుకుంటామని వారు వెల్లడించారు.

ఈ బృందంలో పరిశోధనా కేంద్రం సభ్యులు గట్టిపల్లి అర్జున్, కాక నితిన్, మధు, గట్టమ్మ ప్రధాన పూజారి కొత్త సదయ్య, కొత్త లక్ష్మయ్య, అరిగెల సమ్మయ్య, ఆకుల మొగిలి, ఆదివాసీ నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ తదితరులు ఉన్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో 2000 సంవత్సరం నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని టీఎస్టీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, కార్యదర్శి ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, మెడికల్ ఫోరం జిల్లా అధ్యక్షురాలు కావేటి మంగమ్మ, ఏఎన్ఎంల జిల్లా అధ్యక్షురాలు డి.జ్యోతి అన్నారు. సదరు డిమాండ్‌తో స్థానిక కలెక్టరేట్ ఎదుట వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం ఏఎన్ఎంలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏఎన్ఎంలు తమ సమస్యల పరిష్కారం కోసం అనేక ఆందోళనలు చేపట్టిన సమయంలో పాలకులు హామీలిస్తూ విస్మరిస్తున్నారని మండిపడ్డారు.

ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేసేందుకు డిసెంబరు 29న రాత పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దానిని రద్దుచేసి అందరిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, పురుషోత్తం, కేవీ. రాజు, నసీమాబేగం, సువర్ణ, పార్వతి, వనిత, సుమలత, సరిత, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

29న దీక్షా దివస్‌ను

విజయవంతం చేయాలి

జిల్లా ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వర్‌రావు



మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 29న జరుపతలపెట్టిన దీక్షా దివస్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్‌లో మాజీ ఎంపీ మాలోతు కవిత క్యాంపు కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాటి తెలంగాణ ఉద్యమ సమయంలో నవంబరు 29న మాజీ సీఎం కేసీఆర్ దీక్ష చేపట్టారని, దానిని పురస్కరించుకుని ప్రతి ఏటా దీక్షా దివస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యావత్ తెలంగాణ ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చి 14 సంవత్సరాలు కొట్లాడి స్వరాష్ట్రాన్ని తీసుకువచ్చిన మహా నేత కేసీఆర్ అని చెప్పారు. దీక్షా దివస్‌లో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అంగోతు బిందు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, ముత్యం వెంకన్న, ఎడ్ల వేణు, బానోత్ రవికుమార్, జెరిపోతుల వెంకన్న, ఎమ్డీ. ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా

అమరత్వం తీరని లోటు

మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్

వరంగల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రొఫెసర్ సాయిబాబా అమరత్వం ప్రజాస్వామిక ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోనూ, అంతర్జాతీయంగానూ పీడిత ప్రజలు, సామాజిక సముదాయలు, పీడిత జాతులు ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడే ఒక గొప్ప నాయకుడిని కోల్పోయాయన్నారు. ఆయన జీవితంలో 1990 నుంచి ప్రజాస్వామిక, విప్లవ, ప్రజా ఉద్యమాల కోసం నిరంతరం తపించారని తెలిపారు. 90 శాతం వికలాంగత్వం ఉన్నా వ్యక్తిగత, ప్రజా ఉద్యమ జీవితంలో అది ఆటంకం కాలేదన్నారు. ఆయన మహోన్నత ఆశయాలు, పీడిత ప్రజల పట్ల, వారి అపార శక్తి పట్ల సాయిబాబాకు గల అచంచల విశ్వాసమే ఎన్ని నిర్బంధాలనైనా ఎదుర్కొనేలా చేసిందని తెలిపారు.

ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాలు, ఆదివాసీ ప్రజలు, ప్రజాసంఘాలు, వారికి నాయకత్వం వహించే మావోయిస్టు పార్టీపై నిర్మూలన యుద్ధం కొనసాగిస్తున్న స్థితిలో సాయిబాబా అమరత్వం తీరని లోటన్నారు. ఆయన చూపిన సాహసం, దృఢ సంకల్పం, ప్రజల పట్ల అంకితభావం, త్యాగనిరతి భవిష్యత్తులో ప్రజాస్వామిక ఉద్యమాలకు ప్రేరణనందిస్తాయని అన్నారు. సాయిబాబా ఆదర్శాల స్ఫూర్తితో ఉజ్వలబాటలో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాల్సిందిగా దేశంలోని నిజమైన విప్లవ, ప్రజాస్వామిక, లౌకిక, దేశభక్తియుత శక్తులకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిస్తుందని అభయ్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఆపరేషన్ కగార్ దాడిని ప్రతిఘటించాలి

మావోయిస్టు రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

డిసెంబరు 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే పీఎల్‌జీఏ వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ (మావోయిస్టు) సెంట్రల్ మిలటరీ కమిషన్‌తో పాటు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ వేర్వేరు ప్రకటనల్లో కోరారు. జనవరి నుంచి కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ దాడిని ప్రతిఘటించాలని, గత ఏడాది కాలంలో అసువులు బాసిన అమరుల త్యాగాలను ఎత్తిపట్టండని పిలుపునిచ్చారు. పీఎల్‌జీఏలో చేరేందుకు అర్హులైన వారిని రిక్రూట్ చేయాలని కోరారు. పీఎల్‌జీఏ యూనిట్లు ఉన్న చోట గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాలని ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

పీఎల్‌జీఏ వారోత్సవాలను

విజయవంతం చేయాలి

మావోయిస్టు జేఎండబ్ల్యూపీ డివిజన్ కార్యదర్శి వెంకటేశ్

ఏటూరునాగారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) 24వ వారోత్సవాలను డిసెంబరు 2 నుంచి 8 వరకు గ్రామగ్రామానా ఘనంగా జరుపుకోవాలని మావోయిస్టు పార్టీ జయశంకర్, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శి కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయ సాధన కోసం ప్రజా యుద్ధాన్ని కొనసాగిస్తున్న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి డిసెంబరు 2 నాటికి పీఎల్‌జీఏకు 24 ఏళ్లు నిండుతాయని పేర్కొన్నారు. అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో వారోత్సవాలను వారం రోజుల పాటు విప్లవోత్సాహంతో జరుపుకోవాలని పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాలకు, విప్లవ ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న దుష్ట పథకానికి తలవంచక త్యాగనిరతి, అసమాన ధైర్య సాహసాలతో ప్రతిఘటిస్తూ పీఎల్‌జీఏ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

గత సంవత్సరం 254 మంది వీర గెరిల్లాలు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ హిందూ రాష్ట్ర ఏర్పాటు చేసే దృష్టి పథకంలో భాగంగా బ్రాహ్మణీయ హిందుత్వ బీజేపీ ప్రభుత్వం నిత్యం దాడులు జరుపుతున్నాయని విమర్శించారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ విస్మరించిందని దుయ్యబట్టారు. దోపిడీ పాలనను కూల్చివేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి యువతీ యువకులంతా పీఎల్‌జీఏలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలలను

బలోపేతం చేయాలి : డీఈవో


దాతలను సత్కరిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి, హెచ్‌ఎం సునీత

కురవి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మహబూబాబాద్ డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. కురవి మండలం బలపాల ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి 30 మంది పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు రూ.3.30 లక్షలను విరాళంగా అందించారు. ఈ నగదుతో పాఠశాలలో కంప్యూటర్, మినీ వాటర్‌ప్లాంట్, ప్రింటర్, బీరువా, ఎల్ఈడీ స్క్రీన్, పాఠశాల చుట్టూ ఫెన్సింగ్, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, టీషర్టులు, కిటికీలకు గ్రిల్స్, 15 చైర్‌లు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. బలపాల పాఠశాలను ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలలన్నింటిని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేయాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో కీలక పాత్ర వహించిన హెచ్‌ఎం తెలుకుంట్ల సునీత, డాక్టర్ కేశవరావులను ఆయన అభినందించారు. హెచ్‌ఎం సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో బాలోజీనాయక్, హెచ్‌ఎంలు జానయ్య, నర్సింహారెడ్డి, ఉప్పలయ్య, వీరస్వామి, సీఆర్పీ ఉమారాణి, పాఠశాల చైర్‌పర్సన్ పద్మ, ఉపాధ్యాయులు మమత, జ్యోతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2475	2080
పల్లికాయ (సూక)	5000	4000
పల్లికాయ (పచ్చిది)	5750	3000
కందులు	6912	8000
పెసళ్లు	6202	5250
పత్తి	6860	5800
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	---	---
పసుపు (గోల)	---	---
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	13000	11000
యూఎస్341ఏసీ	13500	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

పాంచాలరాయను.. పట్టించుకోరేమయా ?


శిలావస్థలో కాకతీయుల నాటి వైష్ణవాలయం

చరిత్ర

- శ్రీకృష్ణుడిని పాంచాలరాయుడిగా పూజించే ఏకైక క్షేత్రం
- అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా గుర్తింపు



పాంచాలరాయ స్వామి విగ్రహం



ఆలయ ఆవరణలోని రాటణ స్తంభం

హనుమకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ శిల్ప కళా వైభవానికి ప్రతీకగా.. కాకతీయుల నాటి అతి ముఖ్యమైన దేవాలయంగా శ్రీ పాంచాలరాయ స్వామి (కృష్ణ) దేవాలయానికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఓరుగల్లులో జైన, శైవ దేవాలయాలెన్నో ఉన్నా.. శ్రీ కృష్ణుడిని పాంచాలరాయుడిగా పూజించే ప్రత్యేకత కలిగిన ఆలయం ఇదొక్కటే. ఇలాంటి దేవాలయం దేశంలో మరెక్కడా లేదని చెబుతుంటారు. పాంచాలరాయ స్వామి అంటే శ్రీ కృష్ణుడు. పాంచాలి (ద్రౌపది) మాన సంరక్షణ గావించిన స్వామి పాంచాలరాయ స్వామి. వరంగల్ నగరానికి తూర్పు దిశగా 10 కి.మీ దూరంలోని గీసుకొండ మండలం శాయంపేట హవేలి గ్రామంలో కాకతీయులు నిర్మించిన పురాతన ఆలయమైన పాంచాలరాయ ఆలయం.. నాటి తురుష్కుల దండయాత్రలతో ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో క్రీశ. 1503లో షితాబుఖాను (సీతాపతి రాజు) దీనిని పునర్నిర్మించినట్టు ఆయన వేసిన ఓ శాసనం చెబుతోంది. కృష్ణ దేవాలయాలు చాలా చోట్ల చాలా పేర్లతో కనిపి స్తాయి కానీ పాంచాలరాయుడనే పేరుతో ఆలయాలున్న ఆధారా లు మాత్రం కనిపించవు. రాతి స్తంభాల ముఖద్వారం, దానిపై ఒక చిన్న గోపురం నిర్మితమై ఉండగా.. ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం, కాకతీయుల శైలిలో మహాగణపతి విగ్రహం ఉన్నా యి. ధ్వజ స్తంభం పక్కన భక్తాంజనేయ స్వామి, గరుత్మంతుని విగ్రహాలు దర్శనమిస్తాయి. ఆలయం లోపలికి వెళ్లగానే రంగమంటపం, దాని మధ్య భాగంలో నున్నని గుండ్రని వేదిక, పై భాగంలో రాతి చక్రం, మం డప నిర్మాణానికి ఉపయోగించిన రాతి స్తంభాలు, వాటిని నిలిపిన తీరు కాకతీయు నిర్మాణ శైలికి అద్దం పడతాయి. గర్భాలయం ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉన్న పూర్ణకుంభాలు, ద్వారంపై భాగంలో ఉండే గజలక్ష్మి విగ్రహం సాధారణంగా మనకు కాకతీ య ఆలయాల్లో కనిపించే విశేషాలే.


గుడికి వాయువ్యంలో బావి ఉండగా ఆ బావి ముందర 15 అడుగుల ఎత్తున రాటణ స్తంభం రాతి వేదికలో బిగించి ఉంది. ఈ రాటణం ఆ బావిలోంచి సమీపంలోని పొలాలకు నీందించే యంత్రమని, దాని ద్వారా నీరు పొందినందుకు ప్రతిఫలంగా రైతులు సుంకం చెల్లించేవారని తెలుస్తోంది.

విగ్రహం వెనుక జడచుట్ట..

గర్భాలయంలో మూలవిరాట్టుకు పైభాగంలో ఒక అందమైన రాతి పద్మం చెక్కి ఉంటుంది. స్వామి విగ్రహానికి వెనుక భాగంలో జడలాంటి గుండ్రని చుట్ట కనిపిస్తుంది. కాళ్లకు పట్టీలు, మట్టెలు కూడా కనిపిస్తాయి. ఈ అలంకరణను బట్టి స్వామి సగం స్త్రీ రూపంలో, మరో సగం పురుషుని రూపంలో ఉన్న విశిష్టమైన మూల విరాట్‌గా భావిస్తున్నారు. ఈ విధంగా విగ్రహాల వెనుక భాగంలో జడనలంకరించడం వరంగల్ పురాతత్వశాఖ వారి మ్యూజియంలోని గణపతి విగ్రహంలోనూ ఉంటుంది. ప్రధాన ఆలయానికి పక్కనున్న మండపంలో అండాళ్ అమ్మవారి విగ్రహం పన్నీద్దరు ఆళ్వారుల విగ్రహాలు ఉన్నాయి.

పట్టింపు లేక..

కాకతీయుల నాటి అత్యంత అరుదైన, అద్భుతమైన ఈ ఆలయాన్ని పట్టించుకునేవారే లేరు. విశాలమైన ఆవరణ కలిగిన ఈ ఆలయంలో ప్రాంగణంలోని మండపం కొంత మేరకు కూలిపోయింది. స్తంభాలు, శిల్పాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఈ ప్రాచీన ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు ఏ మాత్రం చొరవ చూపడం లేదు. వాస్తవానికి ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర పురావస్తు శాఖదే. ఇకనైనా పాలకులు ఈ ఆలయ అభివృ ద్ధిపై దృష్టి పెడితే ఓరుగల్లులో మరో పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుందనడంలో సందేహం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఆలయ ముఖద్వారం



పాంచాలరాయ స్వామి ఆలయం వెనుక భాగం

సుందర రూపం.. మూలవిరాట్

ఈ ఆలయంలోని పాంచాలరాయ స్వామి విగ్రహం ఒక అద్భుత కళాఖండం. మూర్తిలో స్త్రీలాలిత్యం కనిపిస్తుంది. శంఖు, చక్ర, గదా, పద్మాలతో లక్ష్మీసమేతుడై చతుర్భుజుడైన పాంచాలరాయ స్వామి విగ్రహం కాకతీయ శిల్పాలలోనే ఒక అపురూప సుందరరూపమని చెబుతారు. ఈ విగ్రహానికి పైభాగంలో రాతితో చెక్కిన మకర తోరణాలున్నాయి. మకర తోరణాలను మొసళ్ల బొమ్మలతో అలంకరించి వాటినోళ్ల నుండి వెలువడిన లతలు ప్రధాన విగ్రహాన్ని అలంకరించినట్టు చిత్రించడం కాకతీయ శిల్పకళా నైపుణ్యానికి ప్రతీక. ఇలాంటి మకర తోరణాలు మనకు హనుమకొండ వేయిస్తంభాల గుడి, రామప్ప గుడి మొదలైన చోట్ల కనిపిస్తాయి. కాకతీయుల కిరీట శిల్పాన్ని పోలిన కిరీటమే స్వామివారిని అలంకరించి ఉంటాయి. పాంచాలరాయ స్వామి విగ్రహం చుట్టూ దశావతార విగ్రహాలు చెక్కి ఉండడం మరోవిశేషం.



రుద్రేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు ఉపేంద్ర శర్మ

రుద్రేశ్వరుడికి లక్ష బిల్వార్చన

108 శంఖాల అలంకరణలో సిద్ధేశ్వరుడు

హనుమకొండ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వర స్వామివారికి లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. 300 మంది దంపతులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం తాటిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు కార్తీక సమారాధన జరి పారు. మహిళలు ఉసిరి చెట్టు వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. దీప దానాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, అర్చకులు మణికంఠ శర్మ, సందీప్ శర్మ, ప్రణవ్ ఈ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇక హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో సిద్ధేశ్వరుడిని 108 శంఖాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు సిద్దేషని రవి కుమార్, సురేష్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శంఖాలతో సిద్ధేశ్వరుడికి అలంకరణ

సిద్దేశ్వరాలయం కబ్జాపై చర్యలకు రంగం సిద్ధం

హనుమకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) పద్మాక్షి దేవాలయం భూమిని ఆక్రమించిన ప్రైవేటు కాలేజీ యాజమాన్యంపై ఎట్టకేలకు ట్రిబ్యునల్‌లో కేసు నమోదైంది. సోమవారం లోకాయుక్త కోర్టులో హనుమకొండ పద్మాక్షి, సిద్దేశ్వర, రంగనాయక, వీరపిచ్చమాంబ, వరంగల్‌లోని వేణుగోపాల స్వామి దేవాలయాల భూముల కబ్జాపై వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదుపై లోకాయుక్త సోమవారం విచారణ జరిపింది. ఈ విచారణకు చక్రపాణి, రాజుతో పాటు దేవాదాయ శాఖ పక్షాన సిద్దేశ్వరాలయం ఈవో ప్రసాద్ హాజరయ్యారు. నాలుగు సంవత్సరాల క్రితం దాఖలు చేసిన ఈ ఫిర్యాదుపై లోకాయుక్త జస్టిస్ సివి రాములు విచారణలో భాగంగా జారీ చేసిన ఆదేశాల మేరకు 5 దేవాలయాలకు చెందిన 20.39 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయిందని దేవాదాయ శాఖ నివేదికను సమర్పించింది.

మొత్తం 69 కబ్జా దారుల్లో ఒకరైన ప్రైవేటు కాలేజీ యాజ మాన్యం సిద్దేశ్వరాయానికి చెందిన 9 గుంటలు ఆక్రమించినట్టు రెండు సంవత్సరాల క్రితం అధికారులు లోకాయుక్తకు తెలిపారు. సోమవారం విచారణలో సిద్దేశ్వరాలయం భూమి కబ్జాకు సంబంధించి కాలేజీ యాజమాన్యంపై ట్రిబ్యునల్‌లో కేసు వేసినట్టు ఈవో ప్రసాద్ లోకాయుక్తకు తెలిపారు. అలాగే రంగనాయకస్వామి ఆలయ భూములను ఆక్రమించిన 13 మంది కబ్జాదారులపై కూడా కేసులు దాఖలు చేసినట్టు చెప్పారు. తదుపరి విచారణ వచ్చే నెల 13కు వాయిదా పడింది.

గిరి బిడ్డలకు అండగా..

అందరూ కదలాలి

(5వ పేజీ తరువాయి)

బుద్ధి చెప్పే సమయం వస్తుందన్నారు. తాము గిరిజన రైతుల కోసం బయలుదేరి మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన ఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకని డీజీపీ ప్రశ్నించారని, కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు.. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళిత, గిరిజనులు, బీసీలు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి పాలన ఏడాది పూర్తవుతోందని, వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. రైతుబంధు ఎగొట్టారని, పింఛన్ పెంచలేదని, బోనస్ బోగస్ అయ్యిందని, ఆడబిడ్డలకు మహాలక్ష్మి స్కీం రాలేదని ఆరోపించారు. తాను మహబూబాబాద్ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడుతామని అంటుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు తాము భయపడేది లేదని, ఆ పార్టీని కూకటివేళ్లతో పెకిలిస్తామన్నారు. మానుకోటలో ధర్నాకు అనుమతివ్వకుంటే హైకోర్టుకు పోయి తెచ్చుకున్నామని, వెయ్యి మంది అనుకుంటే 25వేల మంది వచ్చారని, ప్రభుత్వం మీద ఎంత వ్యతిరేకత ఉందో ఈ మహాధర్నా చూస్తే అర్థమవుతుందన్నారు.

ఇతర నేతలు ఏమన్నారంటే..

శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ సిరికొండ మధూసూదనాచారి మాట్లాడుతూ నాడు తెలంగాణ ఉద్యమానికి... నేడు లగచర్ల గిరిజనులకు మద్దతుగా మానుకోట గడ్డ నిలిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను ప్రజలకు వివరించేందుకు ధర్నా చేపట్టామన్నారు. బీఆర్ఎస్‌కు 25 సంవత్సరాల చరిత్ర ఉందని అందులో 14 సంవత్సరాలు ఉద్యమ నేపథ్యమేనన్నది గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజలకు చుక్కలు చూపిస్తుందన్నారు. ఇక కాంగ్రెస్ ఆటలు సాగవని ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటాల బాట పట్టిందని పేర్కొన్నారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడుగుపెట్టిన చోటల్లా కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైందని ఎద్దేవా చేశారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు అండగా బీఆర్ఎస్ నిలుస్తుందన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ గిరిజనుల ఆశాజ్యోతి మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. లగచర్ల గిరిజనులకు అండగా బీఆర్ఎస్ నిలబడితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అహంకార, నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ వాలడం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే సీఎం ఎజెండా అని ఆరోపించారు. ఆయనకు ఉద్యమగడ్డ మానుకోట నుంచే కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పేదల భూమిని రక్షించేందుకు.. తెలంగాణ బిడ్డల భవిష్యత్ కోసం బీఆర్ఎస్ పోరాడుతుందని, గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి 'మా తండాలో మా రాజ్యం' అనే నినాదాన్ని అమలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడుతూ... గిరిజనుల ఓట్లతో గెలిచిన సీఎం రేవంత్‌రెడ్డి వారి భూములను లాక్కోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. ధర్నాను అడ్డుకుంటామని చెప్పిన వారికి మహాధర్నా విజయవంతం కావడం చెంపపెట్టు లాంటిదన్నారు. మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రజలు ఓట్లేసి కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే వారి భూములే లాక్కుంటున్నారని, గిరిజన రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, హరిప్రియానాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ఆంగోతు బిందు, గుడిపుడి నవీన్‌రావు, కుడితి మహేందర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, మర్రి రంగారావు, బానోత్ రవికుమార్, గాంధీనాయక్, అయూబ్‌పాషా, జెరిపోతుల వెంకన్న, చిట్యాల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ స్కెచ్ సక్సెస్ !

- మానుకోట మహాధర్నాకు తరలొచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి రాక
- ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు

మహబూబాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంజారాల్లో తమకున్న పట్టును సడలనీయకుండా.. లగచర్ల అంశాన్ని అస్త్రంగా మలుచుకుని బీఆర్ఎస్ మానుకోట వేదికగా వేసిన స్కెచ్ సక్సెస్ అయ్యింది. వాస్తవానికి 22న బీఆర్ఎస్ నేతలు మహాధర్నాకు సిద్ధమయ్యారు. కానీ తొలుత కేటీఆర్ ధర్నాకు అనుమతిస్తామంటూ దాటవేత ధోరణి కొనసాగించి ఆఖరి నిమిషంలో చేతులెత్తేసిన పోలీసుల తీరుతో బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా హైకోర్టును ఆశ్రయించి అనుమతి తెచ్చుకోగలిగింది. అంతటితో ఆగకుండా వెయ్యి మందితో మహాధర్నా అని ప్రచారం చేసుకుంటూ వచ్చిన గులాబీ దళం.. రహస్యంగా భారీగా జన సమీకరణకు పావులు కదిపింది. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మానుకోట ధర్నాచౌక్ తహసీల్ సెంటర్‌లో నిరసన ధర్నాకు మహబూబాబాద్ జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలోని పలు మండలాల నుంచి గులాబీ శ్రేణులు తరలివచ్చారు. అంతేకాదు.. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం నుంచి కూడా ముఖ్యులు రావడంతో బీఆర్ఎస్‌లో జోష్ కనిపించింది. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్సీలు ఒక్కతాటిపైకి వచ్చి కేటీఆర్ మహాధర్నా ద్వారా గులాబీ బలం తగ్గలేదని నిరూపించారు. ఇప్పటికే కేటీఆర్ ధర్నాకు అనుమతి విషయంలో రచ్చ జరిగిన నేపథ్యంలో ఏ మాత్రం తొందరపడినా బీఆర్ఎస్‌కే ప్లస్ పాయింట్ అవుతుందని భావించిన కాంగ్రెస్ మౌనం వహిస్తోంది. ఈ పరిణామాలను అనువుగా మలచుకున్న బీఆర్ఎస్ మహాధర్నాను సక్సెస్ చేసుకుంది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీలు, ముఖ్యనేతలు ఎవరికి వారే జనం తరలింపులో తమవంతు కృషి చేయడం, దీనికి తోడు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ గుర్తింపు కోసం, బరిలో నిలవాలనుకుంటున్న ఆశావహులు గ్రామాల్లో తమ బలం చాటుకునేందుకు పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం కల్పించడం కలిసొచ్చింది.

అయితే ఉద యం 10.30 గంటల వరకు పలుచగా కనిపించిన వేదిక అరగంటలోనే నిండిపోయింది. మహబూబాబాద్ చుట్టుపక్కల నుంచి కార్యకర్తలు తరలి వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు మహాధర్నా జరిగిన తీరుపై నిఘా పెట్టారు. పలు మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఆంక్షలు విధించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్డుమార్గంలో మరిపెడ మీదుగా మధ్యాహ్నం 12.05 గంటలకు మహబూబాబాద్‌లోని వేదిక వద్దకు చేరుకున్నారు. ఒకరిద్దరి ముఖ్యుల ప్రసంగాల తర్వాత 12.36 గంటలకు ప్రసంగం ప్రారంభించిన కేటీఆర్ సరిగ్గా 15 నిమిషాలు మాట్లాడారు. ఆది నుంచి ఆఖరి వరకు అడుగడుగునా పద్నాలుగేళ్ల కిందట మానుకోటలో సమైక్యవాదులను రాళ్లతో తరిమిన సంఘటనను ప్రస్తావిస్తూ ఈ గడ్డ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ శ్రేణుల్లో ఉత్తేజం నింపారు. తెలంగాణ ఉద్యమంలో నాడు మానుకోట ఘటన కీలక మలుపు తిప్పిందని కేటీఆర్ ప్రస్తావించినప్పుడు సభికుల నుంచి హర్షాధ్వానాలు మిన్నంటాయి.



మానుకోట మహాధర్నాలో గిరిజన మహిళతో ముచ్చటిస్తున్న కేటీఆర్

భావి సీఎం కేటీఆర్ అంటూ నినాదాలు

కేటీఆర్ తన ప్రసంగంలో లగచర్లలో గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించేందుకు మానుకోట వస్తుంటే అడుగడుగునా అడ్డుకునేందుకు ప్రయత్నించారని.. ఒక్క లగచర్ల ఘటనే కాదు.. రాష్ట్రంలో దళిత, గిరిజన, బీసీలపై ఎక్కడ చిన్న సంఘటన జరిగినా బీఆర్ఎస్ అక్కడికి వెళ్తుందని, అవసమైతే రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో గులాబీ గళం వినిపిస్తామని, ధర్నాలు చేస్తామని స్పష్టం చేశారు. ఆసయంలో బీఆర్ఎస్ శ్రేణులు చప్పట్లతో ధర్నా ప్రాంగణాన్ని మారుమోగించారు. కొందరు నాయకులు, కార్యకర్తలు 'భావి సీఎం కేటీఆర్..' అంటూ నినాదాలతో హోరెత్తించారు. మొత్తానికి 15 నిమిషాల కేటీఆర్ ప్రసంగం ఆద్యంతం ఇటు గులాబీ శ్రేణులను ఉత్తేజపరుస్తూనే అటూ సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పాలనను ఎండగడుతూ కొనసాగింది. ఈ మహాధర్నా విజయవంతంతో కాంగ్రెస్ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు అంతర్మథనంలో పడిపోయారని సమాచారం. ఎక్కడ తప్పు జరిగింది.. ఇక ముందు అనుసరించాల్సిన వ్యూహాలేంటి? స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న దృష్ట్యా ప్రజలు బీఆర్ఎస్ వైపు మళ్లకుండా తాము ఎలాంటి చర్యలు తీసుకోవాలి లాంటి విషయాలపై తర్జన.. భర్జన పడుతున్నట్టు చర్చ జరుగుతోంది. మొత్తానికి లగచర్ల ఘటనపై కేటీఆర్ నిర్వహించిన ధర్నా బీఆర్ఎస్‌కు కలిసొచ్చిందని, ఇదే జోష్‌ను స్థానిక సంస్థల ఎన్నికల వరకు కొనసాగించేందుకు ఆ పార్టీ నేతలు కార్యాచరణకు సిద్ధమవడం విశేషం.

రైతుబంధు వస్తోందా ?

అమనగల్ రైతులతో కేటీఆర్ మాటామంతి

మహబూబాబాద్ అగ్రికల్చర్ (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలంలోని అమనగల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొంతసేపు రైతులతో ముచ్చటించారు. సోమవారం మహాధర్నా ముగించుకుని మహబూబాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో ఆయన అమనగల్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆగారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం అక్కడి రైతులతో పక్కనే ఉన్న పొలం గట్టుపై కూర్చుని మాట్లాడారు. రైతుబంధు వచ్చిందా? వడ్ల కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయి? బోనస్ ఇస్తున్నారా?' అని ప్రశ్నించారు. దాంతో అక్కడి రైతులు రైతుబంధు ఇప్పటి వరకు పడలేదని, కొంత మందికి రుణ మాఫీ కాలేదని, బతుకమ్మ చీరలు కూడా అందలేదని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ వెంట ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో పాటు వద్దిరాజు కిషన్, తదితరులున్నారు.



రైతులతో ముచ్చటిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్

కేయూక్యాంపస్, నవంబరు 25 : (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని నవంబరు 26 నుంచి జరుగాల్సిన డిగ్రీ 1,3, 5వ సెమిస్టర్ పరీక్షలను రీషెడ్యూల్ చేశారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో జరుగాల్సిన సబ్జెక్టులను పరీక్షల టైం టేబుల్‌లో పేర్కొన్న పరీక్షలన్నీ ముగిసన తర్వాత తేదీల్లో నిర్వహిస్తామని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణా ధికారులు డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ పి. వెంకటయ్యలు సోమవారం వెల్లడిం చారు. గతంలో ప్రకటించిన ప్రకారం నవంబరు 29వ తేదీ నుంచి జరిగే పరీక్షలన్నీ యథావిధిగా జరుగుతాయని స్పష్టం చేశారు.

ప్రైవేట్ కళాశాల సమ్మె ఎఫెక్ట్

రాష్ట్రవ్యాప్తంగా గత రెండేళ్ల నుంచి ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడం లేదు. దీంతో రెండు దఫాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నేతృత్వంలో ఫీజుల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ప్రైవేట్ కళాశాలలు సమ్మెకు దిగారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ మేరకు రెండు దఫాలుగా అక్టోబరు 14 నుంచి 18 వరకు చేసిన సమ్మెతో పాటు నవంబరు 19 నుంచి 24 వరకు చేసిన సమ్మెను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విరమించాయి. ప్రైవేట్ కళాశాలలు తమ డిమాండ్‌ల సాధన కోసం సమ్మెకు దిగడంతో విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజుల వసూలు చేపట్టలేదు. అలాగే ఆర్థిక ఇబ్బందులతో కొన్ని ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు అప్లికేషన్ ఫీజులను చెల్లించలేదు. దీంతో కేయూ పరీక్షల నియంత్రణాధికారులు ప్రైవేట్ కళాశాల విద్యార్థులతో పాటు కొన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాల్ టికెట్లను వర్సిటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదు.

దీంతో విద్యార్థులు ఆందోళనకు గురైయారు. అసలు పరీక్షలు నిర్వహిస్తారా లేదా మా పరిస్థితి ఏంటి అంటూ ఆందోళనకు గురైయ్యారు. చివరకు ప్రైవేట్ కళాశాలలు సమ్మె విరమించి ఫీజుల చెల్లింపు కొలిక్కి రావడంతో పరీక్షల తాత్కాలికంగా మూడు రోజులు పాటు రీషెడ్యూల్ చేసి మిగతా పరీక్షలను యథావిధిగా నిర్వహిస్తామని వర్సిటీ అధికారులు ప్రకటించారు.



కేయూ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయం

- నవంబరు 26న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వరకు జరుగాల్సిన డిగ్రీ మొదటి సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వే జేస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్నీ డిసెంబరు 27కు వాయిదా వేశారు.
- నవంబరు 27న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగాల్సిన డిగ్రీ మూడవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజేస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్నీ డిసెంబరు 28కు వాయిదా వేశారు.

రీ షెడ్యూల్ పరీక్షల వివరాలు ఇవే..

- నవంబరు 26న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగాల్సిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజేస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్నీ డిసెంబరు 27కు వాయిదా వేశారు.
- నవంబరు 28న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు జరుగాల్సిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజేస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్నీ డిసెంబరు 30కి వాయిదా వేశారు. వీటితో పాటు బీసీఏ మొదటి సెమిస్టర్, మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ పరీక్షలను రీషెడ్యూల్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి

గార్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హరిహరులకు ప్రీతికరమైన పవిత్ర కార్తీక మాసం చివరి సోమవారం రోజున మండలంలోని బుద్దారం గ్రామంలో గల ఆంజనేయస్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. బుద్దారం, బుద్దారం తండా, డోర్నకల్ తిర్లాపురం గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. బుద్దారం గ్రామానికి చెందిన బెల్లం సత్యనారాయణ అన్నదానం నిర్వహించి భక్తులుకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రామాయణం రాము, గ్రామ పెద్దలు రావూరి వెంకట్రామయ్య, బెల్లం రామకృష్ణ, భాగం లోకేశ్వరరావు, పల్లె బోయిన నాగరాజు, కట్టా బోసు, మహేష్, హరిబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా హిందూ చైతన్య రథ యాత్ర

గార్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో సోమవారం శ్రీరాముడు, సీతాదేవి ఉత్సవ విగ్రహాలతో హిందూ చైతన్య రథ యాత్ర వైభవంగా నిర్వహించారు. స్థానిక పుట్టకోట బజార్‌లోని రామాలయంలో గల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై వేదపండితులు వేదమంత్రాల నడుమ పురవీధుల్లో కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం రథ యాత్ర ముందు భాగంలో భక్తులు రామ కీర్తనలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. రథ యాత్ర మండలంలోని మర్రిగూడెం, బొర్రసక్రుతండా, పుల్లూరు గ్రామాలకు చేరుకోగా ప్రజలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విమల్‌కుమార్ జైన్, వెంగళి బుచ్చిబాబు, చల్లా నరేష్, గుగులోత్ గణేష్ నాయక్, పాల్తీయా ప్రశాంత్, రమేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మరిపెడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం మరిపెడ శివాలయంలో డీసీసీబీ డైరెక్టర్, మరిపెడ పీఏసీఎస్ చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి-రజిత దంపతులు మృల్లింగ మహా లింగారచన అష్టోత్తర కళశ అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి రాంచంద్రునాయక్ హాజరయ్యారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శివ మాలాధారణ గురు స్వాములు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : ఆర్డీవో

తొర్రూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీవో గణేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, మైనారిటీ పాఠశాలను తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వం గురుకులాల్లో నాణ్యమైన విద్యను అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాలు సాధించాలని, పదో తరగతిలో పదికి పది ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆయా గురుకులాల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై కళాజాత

డోర్నకల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న పలు సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాత నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు మండలంలోని అమ్మపాలెం, బంజర గ్రామాల్లో ఆటలు, పాటలు, కళారూపాల ద్వారా సంక్షేమ పథకాల అమలుపై వివరించారు. కార్యక్రమంలో కళాకారులు బండ వెంకన్న, కొమిరె వెంకన్న, గడ్డం రాజమౌళి, మిట్టగడపల భరత్, కందుకూరి అనిల్, వంగూరి శ్రీనివాసరావు, అశ్విని, చెడుపాక కవిత, సింధూజ పాల్గొన్నారు.

బీసీ వసతి గృహం తనిఖీ

నర్సింహులపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న బీసీ వసతి గృహాన్ని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎం.నర్సింహాస్వామి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. రికార్డుల ప్రకారం హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థుల వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని వార్డెన్ రాజును ఆదేశించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. చలి తీవ్రత అధికంగా ఉందని తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రాజు, సిబ్బంది ఉన్నారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మరిపెడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ముదిరాజ్‌ల సొసైటీ అధ్యక్షుడు బత్తెం లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోనే ఎల్లంపేటలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లికి వస్త్రాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వెంకటేశ్వర్లు, బుస నాగన్న, బత్తెం అశోక్, అంజనేయులు, సైదులు, సాయిలు, పులిగుజ్జ వెంకన్న, బత్యం వెంకన్న, గుడిసె దేవేందర్, శ్రీను, రమేష్, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు పట్టణంలోని వివిధ వార్డుల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటూ ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పట్టణంలోని రుద్రోజు శ్రీనివాసులు, హనుమాండ్ల వెంకట్‌రెడ్డి, ఫత్తేపురంలో సింగిరికొండ కిష్టయ్య కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంతోష్, సోమ రాజశేఖర్, అచ్చిరెడ్డి, బాపురెడ్డి, నిరంజన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రావణ్, అనిల్ పాల్గొన్నారు.

'పబ్బం గడుపుకొంటున్న లంబాడీ కుల సంఘాలు'

నెల్లికుదురు సెంటర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనను అడ్డు పెట్టుకుని లంబాడీ కుల సంఘాలు పబ్బం గడుపుకుంటున్నాయని లంబాడీ ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయ కర్త జాదవ్ రమేష్‌నాయక్ ఆరోపించారు. మహబూబాబాద్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లగచర్ల మంటల్లో గిరిజన రైతులు పడి కేసుల పాలై సంగారెడ్డి జైలులో మగ్గుతుంటే ఆ మంటల్లో కాంగ్రెస్ కుంపటి దగ్గర కొంత మంది లంబాడీ సంఘాల నాయకులు, మరికొంత మంది బీఆర్ఎస్ కుంపటి దగ్గర చలిమంట కాచుకుంటూ జాతికి ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. జాతి మీద చిత్తశుద్ధి ఉంటే పార్టీలకు, ప్రభుత్వానికి సింహస్వప్నంగా మారాల్సిన కుల సంఘాలు రాజకీయ పార్టీలకు చెంచాగిరి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వారి విధానాలను మార్చుకుని జాతి ప్రయోజనాల కోసం పోరాడాలని కోరారు. లేనియెడల జాతి కుల సంఘాలపై ప్రజలు తిరగబడాల్సిన సమయం వస్తుందన్నారు. సమావేశంలో రాజ్‌కుమార్ జాదవ్, నరేష్ బానోత్, మాలు ధనావత్, గుగులోతు ప్రవీణ్, రవీందర్ పాల్గొన్నారు.

సామర్థ్యాలు పెంపొందించేలా బోధన చేయాలి : ఏఎంవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తరగతుల వారీగా విద్యార్థులు సామర్థ్యాలు సాధించేలా బోధన చేయాలని విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి(ఏఎంవో) ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ తరగతులకు వెళ్లిన ఏఎంవో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు దాశరథి శ్రీధర్, మంజుల, ఉపాధ్యాయులు వెంకన్న, పర్వతాలు, చైతన్య, సునీత, సువర్ణ, బాలు, మధు పాల్గొన్నారు.

మరిపెడలో కేటీఆర్‌కు ఘన స్వాగతం

నన్నపునేని ఆధ్వర్యంలో పాల్గొన్న వరంగల్ తూర్పు నేతలు

మరిపెడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరిపెడ కార్గిల్ సెంటర్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. సోమవారం కేటీఆర్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు మహా ధర్నాకు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా హాజరయ్యారు. ఈ క్రమంలో వరంగల్ తూర్పు మాజీఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో వందలాది మంది బీఆర్ఎస్ శ్రేణులు వరంగల్ నుంచి మరిపెడ బంగ్లాకు పెద్దఎత్తున చేరుకుని కేటీఆర్ కాన్వాయ్‌కి ఎదురేగి స్వాగతం పలికారు. కార్యకర్తల ఉత్సాహం చూసి ఆయన తన వాహనం నిలిపి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. నన్నపునేని నరేందర్ ఆయనకు పూలబోకేను అందించి శాలువాతో సత్కరించారు.

కాగా, కేటీఆర్ మరిపెడ నుంచి రోడ్డు మార్గంలో మహబూబాబాద్ వెళ్తున్న విషయం తెలిసి కూడా స్థానిక బీఆర్ఎస్ పెద్ద నేతలు ఎవ్వరూ పాల్గొనలేదని స్థానిక కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేశారు. కాగా, మహబూబాబాద్‌కు చెందిన యాళ్ల మురళీధర్‌రెడ్డి మరిపెడలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు అక్కడక్కడ కనిపించాయి.



మరిపెడ కార్గిల్ సెంటర్‌లో కేటీఆర్‌కు స్వాగతం పలికిన వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు

కేటీఆర్‌ను సత్కరించిన దయాకర్‌రావు

తొర్రూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనకు నిరసనగా జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన మహాధర్నాకు హాజరైన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సత్కరించారు. తిరుగు ప్రయాణంలో భాగంగా సోమవారం సాయంత్రం తొర్రూరులో ఆగిన కేటీఆర్‌ను దయాకర్‌రావు, పలువురు నాయకులతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు టీఆర్ఎస్ వైపు చూస్తున్నారన్నారు.



కేటీఆర్‌ను సత్కరిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పోచంపల్లి, వైఎంఆర్‌కు కేటీఆర్ ఫోన్

అభినందనలు.. భవిష్యత్‌పై భరోసా

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లగచర్ల గిరిజనులకు మద్దతుగా మహబూబాబాద్‌లో సోమవారం నిర్వహించిన మహాధర్నా విజయవంతంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ అర్బన్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి(వైఎంఆర్)ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. మహాధర్నా విజయవంతం కావడంతో క్రియాశీలకంగా పనిచేసిన ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డికి స్వయంగా కేటీఆర్ ఫోన్ చేసి అభినందించారు. యువతను పెద్ద ఎత్తున తరలించడంతో సఫలీకృతులయ్యారని, ఇదే జోష్‌తో ముందుకు సాగాలని, మంచి భవిష్యత్ ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.



వైఎంఆర్‌ను అభినందిస్తున్న కేటీఆర్



ధర్నాలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ నర్సాళ్ల శ్రీనివాస్, మునిసిపల్ వైస్ చైర్మన్ మాజీ వెంకన్న

కేటీఆర్ సభలో దొంగల హల్‌చల్

నలుగురు వ్యక్తుల నుంచి రూ.22,500 అపహరణ

మహబూబాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహా ధర్నాలో దొంగలు హల్‌చల్ చేశారు. బాధితులు తెలిపిన ప్రకారం... గూడూరు మండలం సురేష్‌నగర్‌కు చెందిన అజ్మీర శోభన్ బీఆర్ఎస్ సభకు హాజరయ్యారు. ఇంటికి పోయే ముందు పురుగుల మందులు కొనుగోలు చేసుకుని వెళ్దామని వెంట రూ.2వేలు తెచ్చుకున్నాడు. వెనుక జేబులో డబ్బు ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని అపహరించుకుపోయారు. నెల్లికుదురు మండలం వస్త్రంతండాకు చెందిన మాజీ సర్పంచ్ గుగులోతు మాన్‌సింగ్‌నాయక్ మహాధర్నాకు జనాన్ని తీసుకురావడంతో వారి రవాణా చార్జీల కోసం రూ.10వేలు తీసుకుని వచ్చాడు. సభ అనంతరం జేబు చూసుకోగా డబ్బులు మాయమయ్యాయి. ఇదే మండలం మదనతుర్తి గ్రామానికి చెందిన మంద అశోక్ రూ.7,200 తీసుకురాగా దొంగలు అపహరించినట్లు చెప్పారు. ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన నీడిగంటి యాదగిరి రూ.3,300 తీసుకురాగా, అతని జేబులో నుంచి కూడా గుర్తు తెలియని వ్యక్తులు కొట్టేశారని చెప్పారు. ఈ విషయంపై నలుగురు బాధితులు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్‌ను వివరణ కోరగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నలుగురు వ్యక్తుల వద్ద ఉన్న డబ్బులు కొట్టేశారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

లగచర్లలో గిరిజనులకు న్యాయం జరిగేవరకు పోరాడాలి

సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ ధరావత్ వెంకన్న

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లగచర్ల గిరిజనులకు న్యాయం జరిగేంతవరకు పోరాడాలని సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ ధరావత్ వెంకన్న కోరారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ... లగచర్లలో జరుగుతున్న అన్యాయాన్ని ఖండించాలని కోరారు. లగచర్ల, రోటిబండ తండా లంబాడీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసేలా పోరాడాలని చెప్పారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్ సూచనలతో ధర్నాకు మద్దతు తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధరావత్ మోతీలాల్, మాలోతు సురేష్, గుగులోతు నందులాల్, రాంబాబు, సురేష్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేపపిల్లల పంపిణీ

ఇనుగుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇనుగుర్తి, కోమటిపల్లి గ్రామాల్లోని ఏడు చెరువుల్లో ప్రభుత్వం అందజేసిన 2.49 లక్షల చేప పిల్లలను సోమవారం ఎంపీడీవో క్రాంతి వదిలారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న చేపపిల్లలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఇనుగుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాన్ని రూపొందించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న డిమాండ్ చేశారు. ఇనుగుర్తి మండల కేంద్రంలో సోమవారం వివిధ మిల్లులకు చెందిన ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు వంద మంది వెంకన్న సమక్షంలో సంఘంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమరశీల పోరాటాలతో కార్మికులు హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముసుగు వెంకన్న, ఎ.సోమయ్య, ఎన్.మంగు, ఎ.రాములు, కె.యాకాంబ్రం, పి.బుచ్చయ్య, మాకు సూరయ్య, మాలి జంపయ్య, నద్దునూరి రాములు, మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.

యువతి ప్రేమను నిరాకరించిన తల్లిదండ్రులు

- 100కు ఫోన్ చేసిన యువతి
- భరోసా సెంటర్‌కు తరలింపు

కురవి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమ పెళ్లికి తల్లిదండ్రులు నిరాకరిస్తున్నారని కురవి మండలం రాజోలు గ్రామానికి చెందిన ఓ యువతి స్థానిక పోలీసులను ఆశ్రయించింది. కురవి ఎస్ఐ సతీష్ తెలిపిన ప్రకారం... రాజోలు గ్రామానికి చెందిన ఓ యువతి హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తుండగా, అదే కంపెనీలో పనిచేస్తున్న తిరుపతికి చెందిన యువకుడితో ప్రేమలో పడింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు యువతిని స్వగ్రామానికి తీసుకువచ్చి ఫోన్ అందుబాటులో లేకుండా ఇంట్లో నిర్బంధించారు. సోమవారం ఫోన్ దొరకపట్టుకున్న యువతి డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు యువతి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువతి కోరిక మేరకు మహబుబాబాద్‌లోని సఖి భరోసా సెంటర్‌కు తరలించారు.

గిరిజన మహిళపై లైంగిక వేధింపులు

వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

నెల్లికుదురు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గిరిజన మహిళను లైంగికంగా వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై పోలీసులు సోమవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. రామన్నగూడెం గ్రామానికి చెందిన యాటకాని రామకృష్ణ నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన ఓ గిరిజన మహిళను గత కొన్ని రోజులుగా లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని, మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రామకృష్ణపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

కేసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రోజువారీ కూలీ రూ.600లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఐ చెరుకు బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రిపెల్లి మొగిళి, జాటోత్ బిచ్యానాయక్, సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, గొడిశాల వెంకన్న, సోమారపు ఎల్లయ్య, ఆవుల కట్టయ్య, బి.ఎల్లయ్య, రంగయ్య పాల్గొన్నారు.

- మరిపెడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై రైతు, కార్మికులు సోమవారం మరిపెడ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకుడు మధుసూదన్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండ ఉప్పలయ్య, జిన్న లచ్చన్న, కందాల రమేశ్, బాణాల ఎల్లయ్య, నందిపాటి వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి లక్ష్మయ్య, దొంతు మమత, సోమన్న పాల్గొన్నారు.
- తొర్రూరు: కేంద్రం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముంజంపల్లి వీరన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఓమ భిక్షపతి మాట్లాడారు. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలని నాలుగు సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. దానికి నిరసనగా మంగళవారం జిల్లా కేంద్రంలో మహాధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, మహేందర్, వీరన్న, యాకూబ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.
- కురవి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నల్లపు సుధాకర్ పిలుపునిచ్చారు. కురవి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల ఉత్పత్తి ఖర్చులకు రైతాంగానికి 50 శాతం మద్దతు ధరను ప్రకటించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పంటల బీమా పథకం తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పోతుగంటి మల్లయ్య, పాపయ్య, కడియం సత్యం, మలేడి కోటయ్య, గంధసిరి జ్యోతిబసు, కొండబత్తుల వెంకన్న, గండి వెంకన్న, చల్లగొల్ల మల్లయ్య, గుండోజు ఉపేంద్రాచారి, రుద్రారపు వెంకన్న పాల్గొన్నారు.



మరిపెడ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల బాధ్యులు

ఉపకారమేదీ?

(5వ పేజీ తరువాయి)

24,708 మంది ఎంపికయ్యారు. వీరికి రూ.83.92లక్షలు మంజూరయ్యాయి. 2022-23సంవత్సరంలో 22,728మంది దరఖాస్తు చేసుకోగా ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. 2023-24 సంవత్సరానికి అసలు స్కాలర్‌షిప్‌లకు సంబంధించి నోటిఫికేషనే జారీ కాలేదు.

పోస్టు మెట్రిక్ ఇలా..

ఈ పథకం ద్వారా ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకునే మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు అర్హులు. తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వార్షికాదాయం రూ.2లక్షలు మించకూడదు. 2021-22 సంవత్సరంలో 1560 మంది దరఖాస్తులు చేసుకోగా 138 మంది ఎంపికయ్యారు. వీరికి రూ.1.06 కోట్లు విడుదలయ్యాయి. 2022-23 సంవత్సరంలో 276 మంది దరఖాస్తులు చేసుకోగా నిధులు విడుదల కాలేదు. 2023-24 సంవత్సరంలో అసలు నోటిఫికేషనే విడుదల కాలేదు.

మెరిట్ కం మీన్స్ ఉపకార వేతనాలు..

ఈ పథకం అమలు మరీ దారుణంగా మారింది. అసలు ఈ పథకం అమలులో ఉందా లేదా అన్న సందేహం తలెత్తుతోంది. మెరిట్‌కం మీన్స్ స్కాలర్ షిప్పులు పథకం కింద డిగ్రీ, పీజీ చదువుకునే మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు అర్హులు. తల్లిదండ్రులు, లేదా సంరక్షకుల వార్షికాదాయ పరిమితి రూ.2 లక్షలు మించరాదు. గత మూడేళ్ల నుంచి విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్పులు అందడం లేదు. విచిత్రమేమింటే 2021-22 సంవత్సరంలో ఈ స్కాలర్‌షిప్పుల కోసం విద్యార్థులు పెట్టుకున్న దరఖాస్తుల డాటానే ఆన్‌లైన్‌లో తొలగించారు. 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి స్కాలర్‌షిప్పుల మంజూరు ప్రకటనే రాలేదు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

తొర్రూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని తొర్రూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో ఆస్పత్రి ఫార్మాసిస్టు మహేష్ తండ్రి పారుపల్లి పాపయ్య వర్ధంతి సందర్భంగా గర్భిణులకు పౌష్టికాహారం, పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపం వల్ల గర్భిణులు రక్త హీనతతో ఇబ్బందులు పడుతున్నారని, తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎదునూరి శ్రీనివాస్, వైద్యులు మీరజ్, ప్రియాంక, కిరణ్ కుమార్, శంకర్, శ్రీదేవి, పారుపల్లి మహేశ్వర్, మహేష్ తదితరులు ఉన్నారు.

యువతి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గుండ్లకుంట కాలనీలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. టౌన్ ఏఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపిన ప్రకారం... గుండ్లకుంట కాలనీకి చెందిన మీసాల స్వరూపరాణి-శ్రీనివాస్ దంపతుల చిన్న కుమార్తె మీసాల జ్యోత్స్న(23) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకులో నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన రోహిత్‌తో ప్రేమలో పడింది. ఈ క్రమంలో అక్టోబరు 22న రోహిత్ అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో మనస్తాపం చెందిన జ్యోత్స్న దిగాలుగా ఉండేది. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

పెద్దవంగర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలో ఉంటున్న విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీసీవో, మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని చిన్నవంగరలోని కేజీబీవీ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని, భోజనశాల, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వైద్యులు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ పట్టణ శివారు జమాండ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, బాలిక ఆశ్రమ పాఠశాల, ముత్యాలమ్మగూడెం ఆశ్రమ పాఠశాలల్లో సోమవారం తనిఖీలు చేపట్టారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు రుచి, శుచికరమైన ఆహారం అందించాలని తెలిపారు. వసతి గృహాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు, ఆర్‌సీవోలు గమనించాలని అన్నారు. ప్రత్యేకాధికారులు కూడా తనిఖీలు చేపట్టాలన్నారు.

- కురవి మండల కేంద్రంలోని కేజీబీవీ, నేరడ మోడల్ స్కూల్‌లో మండల ప్రత్యేకాధికారి నర్సింహాస్వామి, డోర్నకల్ వసతి గృహాల్లో మండల ప్రత్యేకాధికారి నర్సింహమూర్తి తనిఖీలు చేపట్టారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

(5వ పేజీ తరువాయి)

గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. తద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. డిసెంబరు 2 నుంచి 15 వరకు నిర్వహించే కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు గృహ సందర్శన కార్యక్రమాలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో స్పర్శ లేని, మచ్చలు, రాగి వర్ణము కలిగిన మచ్చలు గాని ఉంటే అట్టి వ్యక్తులను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి నిర్ధారించాలన్నారు. కుటుంబంలోని ఇంటి సభ్యులందరినీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. 12 వారాల్లోపు గర్భిణుల వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమీల, ప్రోగ్రాం అధికారులు సారంగం, సుధీర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, విజయ్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, వాల్య, ఎల్లయ్య, వనకర్, లవరం, రాజు, గీత, పురుషోత్తం, శారద, రామకృష్ణ, మంగమ్మ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



ఆశ్రమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయుడు సక్రు అన్నారు. మహబూబాబాద్ మండలం రెడ్యాల బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం జాతీయ వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్‌నాయక్, ఇస్మాయిల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ, ఉపాధిలో కూడా అవకాశాలు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, సుదర్శన్, రాజు, సంధ్యారాణి, శ్రీనివాస్, సైదులు, వెంకట్రాం, అరుణ్‌కుమార్, హన్మంతు, పూల్య, అంజయ్య, రమేష్, విజయ్ పాల్గొన్నారు.